
సాక్షి కుమురం భీం

మంగళవారం ׀ 31 ׀ జనవరి ׀ 2023



దిందా.. జగమెరిగేలా..

చింతలమానెపల్లి మండలం దిందా నేపథ్యంలో 'జగమెరిగిన సత్యం' అనే సినిమా తెరకెక్కుతోంది. 80శాతం వరకు గ్రామంలోనే సన్నివేశాలను చిత్రీకరించారు. 8లో▸



పొంచి ఉన్న ప్రమాదం

తిర్యాణి మండల కేంద్రం నుంచి మంచిర్యాలకు వెళ్లే దారిలో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ఎలాంటి సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.1 /20.0

వాతావరణం పొడిగానే ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా అనిపిస్తుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

టీటీయూ జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ ఖమర్



అబ్దుల్ ఖమర్

చింతలమానెపల్లి(సిర్పూర్): తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ)జిల్లా అధ్యక్షుడిగా డబ్బా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అబ్దుల్ ఖమర్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఏరుకొండ నరసింహస్వామి సోమవారం ప్రకటించారు. మండలంలోని డబ్బా గ్రామంలో నూతన జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖమర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి కళాశాలల్లో 'బయోమెట్రిక్' అమలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఫిబ్రవరి 1 నుంచి బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయనున్నట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు విధానంపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. బయోమెట్రిక్ కోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించారని ఆయన వెల్లడించారు.

2న వాహనాల వేలం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని పోలీసు తనిఖీల్లో పట్టుబడిన 14 వాహనాలను జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్‌లో ఫిబ్రవరి 2న ఉదయం 10.30 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలను ప్రత్యక్షంగా హెడ్‌క్వార్టర్‌కు వచ్చి చూసుకునే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. 14 వాహనాలకు సంబంధించిన వివరాలను https://asifabad.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. వివరాలకు నోడల్ అధికారి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నంబర్ 9652225673ను సంప్రదించాలని సూచించారు.

పన్ను బకాయిలు చెల్లించాలి

కాగజ్‌నగర్‌టౌన్: పన్ను బకాయిలు చెల్లించి పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ ఎస్.అంజయ్య కోరారు. 2022– 23 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగిస్తున్నందున ఆస్తి పన్నులు, నల్లా బిల్లులు, దుకాణం లైసెన్స్ ఫీజులు, ఇతర ఫీజులు చెల్లించాలన్నారు. లేకపోతే బకాయిదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవు రోజుల్లో కూడా ప్రజల నుంచి పన్ను బకాయిలను తీసుకుంటామని వెల్లడించారు.

బాపూజీకి నివాళి



నివాళులర్పిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: జాతిపిత గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రవీందర్, ప్రతినిధులు చిలువేరు వెంకన్న, అఖిలాష్, వేణుగోపాల్, అజయ్‌కుమార్, గిరీష్‌కుమార్, శ్రీనివాస్, సంతోష్, అమిత్, లచ్చన్న పాల్గొన్నారు.



వట్టివాగు ప్రాజెక్టులోకి నీటిని మళ్లిస్తున్న కాలువపై నిర్మిస్తున్న ఊమ్ పైప్ బ్రిడ్జి

అత్యవసరం పేరిట వారధి

- ఉల్లిపిట్ట– గోలేటి మధ్య రూ.5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి గతంలోనే టెండర్
- తాజాగా అత్యవసరం పేరిట ఊమ్ బ్రిడ్జికి అనుమతులిచ్చిన జీఎం
- రూ.1.69 కోట్లతో శరవేగంగా కొనసాగుతున్న పనులు
- నిబంధనలు గాలికొదిలిన కాంట్రాక్టర్
- కొల్లూరు ఇసుక బదులుగా స్థానిక చిర్రకుంట ఇసుకతోనే పనులు
- నాణ్యతను పట్టించుకోని సివిల్ విభాగం

సాక్షి, ఆసిఫాబాద్: ఉల్లిపిట్ట– గోలేటి మధ్య సింగరేణి బెల్లంపల్లి ఏరియా అధికారులు చేపట్టిన ఊమ్ పైప్ బ్రిడ్జి పనుల్లో అడుగడుగునా నాణ్యత లోపం కనిపిస్తోంది. అధికారుల అండదండలతో ఇష్టారాజ్యంగా పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ ఖరారైనప్పటికీ సాంకేతిక కారణాలను సాకు చూపి సింగరేణి సివిల్ విభాగం అత్యవసరం పేరిట ఊమ్ పైప్ బ్రిడ్జి పనులకు శ్రీకారం చుట్టింది. శరవేగంగా జరుగుతున్న ఈ బ్రిడ్జి పనుల్లో నాసిరకం సామగ్రి వినియోగిస్తున్నా అధికారులకు పట్టడం లేదు.

టెండర్ ఖరారు.. ప్రారంభం కాని పనులు

తిర్యాణి మండలం ఖైరిగూడలో 1,217 హెక్టార్లలో ఉపరితల బొగ్గు గని తవ్వకాలు జరుగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 6.50 కోట్ల టన్నుల బొగ్గును వెలికితీశారు. ప్రస్తుతం మరో 28.09 హెక్టార్ల మేర గనిని విస్తరించాలని బెల్లంపల్లి సింగరేణి ఏరియా అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం తిర్యాణిలోని ఎన్‌టీఆర్ సాగర్ మత్తడి నుంచి వట్టివాగు ప్రాజెక్టులోకి సహజసిద్ధంగా ప్రవహించే 20 కిలోమీటర్ల పొడవైన వాగును గతంలో 2005లో మొదటిసారి మళ్లించారు. తాజాగా ఈ వాగును రెండోసారి మళ్లించేందుకు సింగరేణి అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఆ వాగుపై వంతెన నిర్మాణంతోపాటు కాలువ పక్క రహదారిని నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించారు. వంతెన నిర్మాణానికి టెండర్లు పిలువగా.. భద్రాచలం కొత్తగూడెంకు చెందిన రంగకిరణ్ అనే కాంట్రాక్టర్ రూ.5 కోట్లకు పనులు దక్కించుకున్నారు. అయితే పనుల ప్రారంభానికి ముందు కాంట్రాక్టర్– సింగరేణి అధికారుల మధ్య సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఇప్పటివరకు పనులు మొదలుకాలేదు.

తాత్కాలికం పేరిట..

వంతెన నిర్మాణం టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదనే సాకుతో సింగరేణి బెల్లంపల్లి ఏరియా ఉన్నతాధికారి తాత్కాలిక(టెంపరరీ) ఊమ్ పైప్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రూ.1.69 కోట్ల విలువైన ఊమ్ పైప్ బ్రిడ్జి పనులను లోకల్ టెండర్ పేరిట మంచిర్యాల జిల్లా గద్దెరేగడికి చెందిన అంజిరెడ్డి అనే కాంట్రాక్టర్‌కు అప్పగించారు. వాస్తవానికి ఈ టెండర్‌ను సైతం ఆన్‌లైన్‌లో పెట్టాల్సి ఉండగా.. జీఎం తన అధికారాలను ఉపయోగించుకుని అంజిరెడ్డికి పనులు అప్పగించారని తెలుస్తోంది.



వాటర్ క్యూరింగ్ ఇలా..

నాసిరకం సామగ్రి..

ఊమ్ పైప్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ ఎక్కడా నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణ సింగరేణి సివిల్ విభాగ వర్గాల్లోనే వినిపిస్తోంది. పైప్‌లైన్ ఏర్పాటు కోసం నిర్మిస్తున్న బెడ్డింగ్ పనులు నాసిరకంగా ఉన్నాయి. బెడ్డింగ్ కూడా అటు– ఇటు మాత్రమే ఇనుప చువ్వలతో వేసి వాటి మధ్య కాంక్రీటుతో నింపుతున్నారు. వాస్తవానికి బెడ్డింగ్ వేశాక.. దానిని నీటితో క్యూరింగ్ చేయాల్సి ఉండగా అలా జరగడం లేదు. బెడ్డింగ్ క్యూరింగ్ కాకుండానే దానిపై పైపులను అమర్చుతున్నారు. ఆపై కేవలం ఇద్దరు కార్మికులు నీళ్ల ట్యాంకర్ నుంచి బకెట్లలో నీటిని తెచ్చి బెడ్డింగ్ తడుపుతుండటం గమనార్హం. పనుల కోసం కొల్లూరు ఇసుకనే అనుమతించాల్సి ఉండగా స్థానికంగా ఉన్న చిర్రకుంటలో లభించే ఇసుకను వాడుతున్నారు. స్టోన్‌డస్ట్ సైతం కేవలం 10 శాతానికే పరిమితమైంది. నాసిరకం పనులపై వివరణ కోరేందుకు బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్‌ను 'సాక్షి ప్రతినిధి' ప్రయత్నించగా.. ఆ వంతెన పనులు సివిల్ విభాగం అధికారులు చూస్తారని వారినే వివరణ అడగండని చెప్పారు. పైగా ఆ రోజు అధికారులు ఎవరూ అందుబాటులో లేరని.. మీరు మరో రోజు రావాలని సమాధానం దాటవేశారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ రాహుల్‌రాజ్



అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు సమర్పించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. భర్త చనిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని, వెంటనే వితంతు పింఛన్ ఇప్పించాలని జన్కాపూర్ గ్రామానికి చెందిన డి.సోయబాయి అర్జీ సమర్పించింది. ఎస్సీ కార్పొరేషన్ కింద కేటాయించిన భూమి కొత్త పట్టా పాస్‌పుస్తకంలో పూర్తిగా నమోదు కాలేదని, వెంటనే సమస్య పరిష్కరించాలని చింతలమానెపల్లి మండలం రణవెల్లికి చెందిన జిల్లిపల్లి బొందక్క విన్నవించింది. కెరమెరి మండలంలోని తన పట్టా భూమి కుమురంభీం ప్రాజెక్టులో ముంపునకు గురైందని, నష్టపరిహారం ఇప్పించాలని వాంకిడి మండలం బాబాపూర్‌కు చెందిన మడవచి జంగు దరఖాస్తు చేసుకున్నాడు. వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని చింతలమానెపల్లి మండలం రణవెల్లికి చెందిన ఖోబ్రగడె చొక్కారామ్, కుడి కన్ను కనిపించడం లేదని దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని సిర్పూర్(టి) మండలం పెద్దబొడకు చెందిన కారన్ బిశ్వాస్ అర్జీ సమర్పించారు. భూమి వివరాలు ధరణి పోర్టల్‌లో తప్పుగా నమోదయ్యాయని వాటిని సవరించాలని చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన కెకారి పెంటయ్య, దేవక్క కోరారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని వాంకిడి మండలం ఖిరిడి గ్రామానికి చెందిన నీలాబాయి, శెండె వసంత దరఖాస్తు చేసుకున్నారు. మూడు తరాలుగా సాగు చేసుకుంటున్న ఇనాం భూమికి ఓఆర్‌సీ పట్టా మంజూరు చేయాలని దహెగాం మండలం చిన్న రాస్పెల్లి గ్రామానికి చెందిన కామెర శ్యాంరావు, కామెర శంకరి, కామెర నేతాజీ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

అసెంబ్లీలో 'ఆశా'ల సమస్యలపై చర్చించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్



వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

ఆసిఫాబాద్‌అర్బన్/కాగజ్‌నగర్‌టౌన్: వైద్యారోగ్యశాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ కోరారు. ఈ మేరకు ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ఆత్రం సక్కు క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేశారు. లోకేశ్ మాట్లాడుతూ ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు తమ గళాన్ని అసెంబ్లీలో వినిపించాలని కోరారు. అదేవిధంగా ఆశ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పీఏకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ కుమార్, నాయకులు కృష్ణమాచారి, నగరం పద్మ, ఆశ కార్యకర్తలు రమాదేవి, వనిత, శోభారాణి, సుశీల, మీనా, సరస్వతి, ప్రమీల, సురేఖ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఫిబ్రవరి 11న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు చాంబర్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్, ప్రిన్సిపల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉమామహేశ్వరితో సోమవారం ఏర్పాటు చేసిన న్యాయవాదుల కోఆర్డినేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో పెండింగ్ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈ మేరకు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు, న్యాయవాదులు రాజీవ్‌రెడ్డి, శ్యాంకుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల లక్ష్యాలు సాధించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్లు, అధికారులు

ఆసిఫాబాద్: రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పనుల లక్ష్యాలు సాధించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో కంటి వెలుగు, జీవో నంబర్లు 58, 59, పోడు పట్టాలు, ఆయిల్‌పాం సాగు, ఉపాధ్యాయుల బదిలీలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మన ఊరు– మన బడి కార్యక్రమం మొదటి విడతలో ఎంపికైన పాఠశాలలను ఫిబ్రవరి 1 నుంచి దశలవారీగా ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. జీవో నంబర్లు 58, 59 కింద వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులకు పోడు పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 26 బృందాలు ఏర్పాటు చేసి, అవసరమైన వారికి అద్దాలు, మందులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో ఎనిమిదేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారికి తప్పనిసరి బదిలీ అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు చేపడతామన్నారు. ఆయిల్‌పాం సాగుకు జిల్లా ఉద్యానవన, వ్యవసాయ శాఖల సమన్వయంతో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశం, డీఆర్వో రాజేశ్వర్, డీఈవో అశోక్, డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డి, గిరిజనాభివృద్ధి జిల్లా అధికారి మణెమ్మ, ఆర్‌అండ్‌బీ ఈఈ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల మెరుపు ధర్నా

- గిట్టుబాట ధర చెల్లించాలని డిమాండ్
- జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన
- ధర్నాను అడ్డుకునేందుకు అధికార పార్టీ నేతలు కుట్ర పన్నారని ఆరోపణ



జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న పత్తి రైతులు

సాక్షి, ఆసిఫాబాద్: గిట్టుబాటు ధర చెల్లించాలని రైతులు సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో మెరుపు ధర్నాకు దిగారు. అయితే ఆందోళనలకు అనుమతి లేదంటూ పోలీసులు అన్నదాతలను చెదరగొట్టారు. బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్నాను అడ్డుకునేందుకు అధికార పార్టీ నేతలు కుట్ర పన్నినట్లు పలువురు రైతులు ఆరోపించారు.

రూ.7,750కు పడిపోయిన ధర

జిల్లాలోని మార్కెట్‌లో 11 శాతం తేమ కలిగిన టాప్ క్వాలిటీ పత్తి ధర అత్యధికంగా రూ.8,800 పలుకగా.. 12 శాతం తేమ కలిగిన పత్తి క్వింటా రూ.8 వేలు, సీ గ్రేడు పత్తి రూ.7,900 చొప్పున ధర పలికింది. పదిహేను రోజులుగా ధరల్లో భారీగా హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. సోమవారం టాప్ క్వాలిటీ పత్తి క్వింటా ధర రూ.7,750– 7,800 మధ్య ఉంది. ధరల తగ్గుదలతో కుదేలవుతున్న రైతులు, కౌలు రైతులు సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ధర్నాకు పిలుపునిచ్చారు. అయితే రైతులు ధర్నాను వాయిదా వేసుకున్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేసినట్లు అన్నదాతలు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చేరుకున్న రైతులు మెరుపు ధర్నాకు దిగి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ సర్కిల్ కాసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ధర్నాకు అనుమతి లేదంటూ పోలీసులు రైతులను పోలీసు వాహనంలో స్టేషన్‌కు తరలించారు. మిగిలిన వారిని చెదరగొట్టారు. న్యాయం కోసం రోడ్డెక్కడం నేరమా.. అని కొందరు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

పత్తి పంటే ఆధారం

జిల్లా వ్యాప్తంగా రైతాంగం 95 శాతం పత్తి పంట సాగుచేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 15 లక్షల క్వింటాళ్ల పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటి వరకు కేవలం సుమారు 3 లక్షల క్వింటాళ్ల పత్తి మాత్రమే మార్కెట్లో విక్రయానికి వచ్చినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ధరల తగ్గుదల ప్రభావం వల్లే రైతులు పత్తిని విక్రయించడానికి ముందుకు రావటం లేదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

రైతుల ర్యాలీకి అనుమతివ్వాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: పత్తికి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీకి అనుమతివ్వాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాణాప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆసిఫాబాద్‌లోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పరి ప్రభాకర్, సతీష్, విష్ణుకుమార్, తిరుపతి, రాము, వెంకటేశ్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

రైతులపై అప్పుల భారం



రాష్ట్ర ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు రూ.12వేలు చెల్లించాలి. గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులపై అప్పుల భారం పడుతోంది. ధర లేకపోవడంతో చాలా మంది పంటను ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు.

– వైరాగడె మారుతి, బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

ఇంటి వద్దే నిల్వ



పత్తితీత పూర్తిచేసి నెల రోజులవుతోంది. ధర లేకపోవడంతో ఇంటి వద్దే పంట నిల్వ చేసుకున్నారు. ఇప్పటికే కొంత వరకు పురుగు పట్టింది. ఇంకా ఆలస్యమైతే నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి.

– బట్టుపల్లి కమలాకర్, గుండి

వంతెనల కోసం రోడ్డెక్కిన ప్రజలు

- కెరమెరిలోని ప్రధాన రహదారిపై ధర్నా



కెరమెరిలోని ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న ప్రజలు, నాయకులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఐదేళ్లయినా వంతెనల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో 13 గ్రామాల ప్రజలు రోడ్డెక్కారు. సమస్య పరిష్కరించాలని ఆందోళన బాటపట్టారు. కెరమెరి మండలం అనార్‌పల్లి, లక్మాపూర్ గ్రామాల వాగులపై నిర్మిస్తున్న రెండు వంతెనలను పూర్తిచేయాలని బోరిలాల్‌గూడ, కరంజివాడ, గోండ్‌గూడ, ఆంద్‌గూడ, శంకర్‌లొద్ది, జన్కాపూర్, కోటా, పరందోళి, ముకదంగూడ, మహరాజ్‌గూడ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. పలు సంఘాల నేతలు మాట్లాడుతూ వంతెనలు అసంపూర్తిగా ఉండటంతో గర్భిణులు, బాలింతలతోపాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో వాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. పీఆర్ ఏఈ స్టీవెన్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ సుధాకర్, తహసీల్దార్ సాయన్నకు వినతిపత్రం సమర్పించారు. గుత్తేదారు నిర్లక్ష్యంతోనే అనార్‌పల్లి వంతెన నిర్మాణంలో జాప్యం జరిగిందని, అతడి కాంట్రాక్ట్ రద్దు చేసినట్లు పీఆర్ ఏఈ తెలిపారు. త్వరలోనే రీటెండర్ వేసేందుకు ప్రతిపాదనలు పంపిచామని నచ్చజెప్పడంతో ప్రజలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్‌కలాం, సర్పంచ్ రాథోడ్ శేశారావు, గోవింద్‌రావు, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్, నాయకులు వెంకట్, బలవంత్, విజేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.12వేలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: పత్తి క్వింటాల్‌కు రూ.12 వేలు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ మాట్లాడుతూ జిల్లాలో పత్తి ధర క్వింటాల్‌కు రూ.9 వేల నుంచి రూ.7,500లకు పడిపోయిందన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టి, క్వింటాల్‌కు రూ.12 వేలు చెల్లించాలని కోరారు. బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడె మారుతి, నాయకులు బాల్దారపు మధుకర్, నాయికిని రాజన్న, రాజేందర్, ప్రహ్లాద్ ఉన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయా సంఘాల నేతలు సోమవారం డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు సక్రమంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.రామన్న, ప్రధాన కార్యదర్శి రాజావేణు, తపస్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఎస్‌టీ యూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వినతి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న సోనేరావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ గిరిజన పోరాట యోధుడు కుమురంభీం మనుమడు సోనేరావు సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశాడు. ఈ సందర్భంగా సోనేరావు మాట్లాడుతూ భీం వారసులమైన తమ రెండు కుటుంబాలకు 2014లో సీఎం కేసీఆర్ ఆర్‌సీ నం.ఈ1/3104/14 ద్వారా జిల్లా కేంద్రంలో ఇళ్లు నిర్మించి ఇస్తామని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఇప్పటి వరకు ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని, సీఎం హామీ నెరవేర్చాలని ఆయన కోరారు.

ఆర్టీసీ బస్సులో పొగలు



బస్సులోంచి వస్తున్న పొగ

తాండూర్(బెల్లంపల్లి): ఆర్టీసీ బస్సులోంచి ఒక్కసారిగా పొగ రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి బెల్లంపల్లి వైపు బయలుదేరిన ఆర్టీసీ బస్సు ఐబీ చౌరస్తా వద్దకు చేరుకోగానే బస్సు వెనుకభాగంలో నుంచి పొగలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును ఆపడంతో ప్రయాణికులు కిందకు దిగారు. బస్సును పరిశీలించిన డ్రైవర్ లైనింగ్‌లు పట్టుకోవడంతో పొగలు వచ్చాయని, ప్రమాదం ఏమీ లేదని చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించారు.

దిందా.. జగమెరిగేలా..



వాగు వద్ద ఓ సన్నివేశం

1994లో గ్రామీణ పరిస్థితుల నేపథ్యం

1994 సంవత్సరంలో గ్రామీణ నేపథ్యం, అప్పటి ప్రజల కట్టుబాట్లు, దర్శకుడి చిన్నతనంలోని అనుభవాల ఆధారంగా చిత్రం రూపొందింది. ప్రేమ సన్నివేశాలు, భావోద్వేగాలు, సంస్కృతి, సంగీతం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు పాలె తిరుపతి తెలిపారు. ఈ సినిమాలోని పలు సన్నివేశాల్లో బ్యాక్‌గ్రౌండ్‌లో నటించేందుకు దిందా గ్రామస్తులకు అవకాశం కల్పించారు. బతుకమ్మ పాటను గాయకురాలు మంగ్లీ ఆలపించారు. దగ్గుబాటి రాణా, సాయిపల్ల వి నటించిన విరాట పర్వం చిత్రానికి సంగీత దర్శకత్వం వహించిన బొబ్బిలి సురేశ్ ఈచిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. హీరో రవితేజ మేనల్లుడు అవినాష్ వర్మ, ఆద్యరెడ్డిలను హీరో హీరోయిన్లుగా తొలిపరిచయం చేశామని, ప్రేక్షకులు ఆశీర్వదించాలని దర్శకుడు తిరుపతి కోరుతున్నారు.



హీరో అవినాష్‌కు సన్నివేశం వివరిస్తున్న దర్శకుడు తిరుపతి

- వెండితెరపై గ్రామీణ జీవన విధానం
- 1994లో జరిగిన ఘటనల ఆధారంగా సినిమా
- మారుమూల గ్రామాన్ని తెరకెక్కిస్తున్న యువ దర్శకుడు
- బ్యాక్‌గ్రౌండ్ నటీనటులుగా స్థానికులకు అవకాశం

చింతలమానెపల్లి(సిర్పూర్): సినిమా అంటే ఒక క్రేజ్.. ఇలాంటి ఓ సినిమా మన ప్రాంతంలో రూపు దిద్దుకుంటే ఆ ఆనందమే వేరు. మండలంలోని దిందా గ్రామ కేంద్రంగా రూపుదిద్దుకున్న చిత్రం.. జగమెరిగిన సత్యం. ఎలాంటి ప్రాచుర్యానికి నోచుకోని దిందా గ్రామం త్వరలో రంగస్థలానికి పరిచయం కాబోతోంది. ఆ గ్రామంలోని వెనుకబడిన పరిస్థితులు, గ్రామస్తుల సహజ అమాయకత్వం ఆసినిమాకు ఆయువుపట్టుగా మారాయి. చిత్రం 80 శాతం వరకు ఈగ్రామంలోనే రూపుదిద్దుకుంది. గ్రామ సమీపంలోని వాగు, రవీంద్రనగర్ వారసంత, గూడెం ప్రాణహిత నది వంతెన, పెంచికల్‌పేట్ పెద్దవాగు, కౌటాల మండల కేంద్రం, పక్కనే మహారాష్ట్రలోని అహేరి వద్ద కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు.

దర్శకుడు స్థానికుడే..

చిత్ర దర్శకుడు పాలె తిరుపతి స్వగ్రామం పెంచికల్‌పేట్ మండలంలోని చెడ్వాయి. చింతలమానెపల్లి మండలంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లివచ్చే క్రమంలో స్థానిక గ్రామాలపై ఉన్న పరిచయమే సినిమా చిత్రీకరణకు కారణమైంది. చెడ్వాయిలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన మంచిర్యాలలో డిగ్రీ వరకు చదువుకున్నారు. సినిమాలపై ఆసక్తితో చిత్రరంగానికి వెళ్లి దర్శకత్వ శాఖలో ఎనిమిదేళ్లు పనిచేశారు. ఈక్రమంలో కొరియన్ శీర్షికన అహేరి అనే లఘుచిత్రం రూపొందించారు. అది విజయం సాధించడంతో మరో నాలుగు లఘు చిత్రాలను రూపొందించారు. ఈ అనుభవంతో చిత్రాన్ని రూపొందించాలనే ఆలోచనతో జగమెరిగిన సత్యం చిత్రాన్ని తెరకెక్కించారు. తన చిన్నతనంలో తన తండ్రి పాలె ఆశన్న, పెదనాన్న బాపులు స్థానికంగా భజన కార్యక్రమాల్లో పాల్గొనేవారు. తండ్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడమే తనకు సినిమారంగంపై ఆసక్తిని పెంచిందని దర్శకుడు తెలిపారు. తన చిన్నతనంలో తండ్రి పాడిన ఒక పద్యాన్ని ఈ చిత్రంలోని ఓ సన్నివేశంలో చిత్రీకరించినట్లు వివరించారు.

పట్టుదలగా ప్రయత్నించాలి

ఎన్నో అవాంతరాలు వచ్చినా దర్శకుడు కావాలనే ప్రయత్నాన్ని నేను విరమించలేదు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎంతోమంది కళాకారులు ఉన్నారు. వారికి సరైన ప్రోత్సాహం లేదు. స్థానికంగా ప్రతిభ ఉండి అవకాశాల కోసం ఎదురు చూసే వారికి ప్రోత్సాహం ఇస్తా.
కళాకారులు ప్రయత్నాలను విరమించవద్దు. పట్టుదలగా ప్రయత్నించాలి.

– పాలె తిరుపతి, దర్శకుడు



క్రీడారత్న అవార్డుకు ఎంపిక



రాజకొమురయ్య

రామకృష్ణాపూర్(చెన్నూర్): బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏటా అందజేస్తున్న క్రీడారత్న అవార్డుకు రామకృష్ణాపూర్‌కు చెందిన వెటరన్ క్రీడాకారుడు రాజకొమురయ్యను ఎంపిక చేసినట్లు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారికి ఏటా అవార్డు అందజేస్తున్నట్లు ఆయ న పేర్కొన్నారు. ఈ ఏడాది పట్టణానికి చెంది న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు, సీనియర్ వెటరన్ క్రీడాకారుడు మడిపెల్లి రాజకొమురయ్య ఎంపికై నట్లు తెలిపారు. మార్చి 12న తిరుపతిలో అవార్డు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



లావణ్య

మంచిర్యాలటౌన్: అస్సాం రాష్ట్రంలోని గౌహతీలో ఫిబ్రవరి 2న నిర్వహించనున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన లావణ్య ఎంపికైంది. డిసెంబర్ 28 నుంచి 31 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చింది. ఉమ్మడి జిల్లా నుంచి మహిళా విభాగంలో మొదటిసారిగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన లావణ్యను సోమవారం వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్ల శంకర్, కార్యదర్శి మైలారం శ్రీనివాస్, కోశాధికారి గాజుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బోరె యాదగిరి, బైరగోని సిద్ధయ్య అభినందించారు.

నేడు జిల్లాస్థాయి పోటీలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, కేజీబీవీ, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో 8, 9 తరగతి చదివే విద్యార్థుల్లో భాషా పటిమను వెలికితీసేందుకు ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం (ఎల్టా) ఆధ్వర్యంలో ఈ నెల 31న జిల్లాస్థాయి విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు గైడ్ టీచర్‌తో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హాజరుకావాలన్నారు. ఇదివరకే పాఠశాల, మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన 80 మంది విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలక్రైం: హైదరాబాద్‌లోని కోంపల్లిలో ఉన్న అవని నృత్యాలయం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 28న నిర్వహించిన శివతాండవం నృత్య పోటీల్లో మంచిర్యాలకు చెందిన 11మంది కళాకారులు అత్యంత ప్రతిభ కనబర్చి వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నారు. మంచిర్యాల ఏసీసీ ప్రాంతానికి చెందిన నామని రవికుమార్ అవని నృత్యాలయం నిర్వాహకుడిగా కొనసాగుతున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 80 మంది కళాకారులు పాల్గొన్నారు. మంచిర్యాల నర్తన రేఖ నాట్య కళాక్షేత్రం విద్యార్థులు సంజన, మహేశ్వరి, అక్షర, యోగితశ్రీ, సాయి హాసిని, కే.అక్షర, సాన్వి, పవనశ్రీ, అనుహ్య, సాయి అశ్రిత, సౌమ్యశ్రీ శివ తాండవం నృత్యాన్ని 60 నిమిషాల పాటు ప్రదర్శించి ప్రతిభ కనబర్చారు. సదరు విద్యార్థులకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, భారత్ వరల్డ్ రికార్డ్ అధ్యక్షుడు లయన్ కేవీ రమణారావ్, డాక్టర్ నామని రవికుమార్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



నంది అవార్డులతో చిన్నారులు

మంచిర్యాల విద్యార్థులకు నంది అవార్డు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళానిలయంలో ఈ నెల 29న భారత్ ఆర్ట్ అకాడమీ ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంది పురస్కారాలు నిర్వహించారు. జతిస్వరం నృత్యానికి మంచిర్యాల నర్తన రేఖ నాట్య కళాక్షేత్రం విద్యార్థులు యోగితశ్రీ, సాయి హాసిని, పవనశ్రీ, అనుహ్య, సాయి అశ్రిత నంది అవార్డు అందుకున్నారు. సదరు విద్యార్థులను ఎల్ఎస్ లలితారావ్, డాక్టర్ ఎల్ఎస్ కే.వీ రమణారావ్ అభినందించారు.

'కాళేశ్వరం' ముంపు భూములు గుర్తించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నాయని, అధికారులు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి ముంపు భూములను గుర్తించి పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ కోటపల్లి మండలం దేవులవాడ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ల ఆధారంగా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పరిహారం అందేలా చూడాలన్నారు. ఏటా నీట మునిగి పంటలు నష్టపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోరల్ల మధు,



ఆందోళన చేస్తున్న దేవులవాడ గ్రామ రైతులు

సుదర్శన్‌రెడ్డి, పద్మ, రాంరెడ్డి, సత్తెమ్మ, కమలమ్మ, మల్లయ్య, లక్ష్మి, కిష్టయ్య, పోషం, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీసీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

అర్చకుడిపై దాడికి పాల్పడిన ఎంసీసీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏసీసీ కాలనీవాసులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వార్డు కౌన్సిలర్ శ్రీలత, సదానందం, కాలనీ వాసులు మాట్లాడుతూ ఏసీసీ కార్మికుల జీతభత్యాల నుంచి జమచేసిన విరాళాలతో శివరామాలయం నిర్మించుకున్నారన్నారు. ఎంసీసీ యాజమాన్యం కాలనీ వాసులను గుడికి రాకుండా అడ్డుకుంటోందన్నారు. ఎంసీసీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పురుగుల మందుతాగి బాలుడు మృతి

భీమారం(చెన్నూర్): పురుగుల మందు తాగి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎలకేశ్వరం గ్రామానికి చెందిన బొమ్మెన సమ్మిరెడ్డి, మౌనిక దంపతుల కుమారుడు జస్వంత్ (6) పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడు. సోమవారం బాలుని తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత ఇంట్లోకి వచ్చి చూడగా పురుగుల మందు డబ్బా మూత తీసి ఉండడాన్ని గమనించారు. అనుమానం వచ్చిన దంపతులు వెంటనే తమ కుమారుడిని మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు క్రిమిసంహారక మందు తాగినట్లు నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం కరీంనగర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: ఉరేసుకుని బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని అరుణక్క నగర్‌కు చెందిన దుబ్బ సుజాత-రవీందర్ దంపతుల కుమార్తె లక్ష్మీవంశిక(12) ఆరోతరగతి వరకు చదువుకుంది. ఆపై చదువులు ఇష్టంలేక ఇంట్లోనే ఉంటోంది. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మానస తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన పెరుగు గణేశ్ (32) కౌటాల మండలంలోని గురుడుపేట గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంపై కాగజ్‌నగర్‌కు వచ్చిన గణేశ్ కౌటాలకు వెళ్తుండగా బాపునగర్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు సోమవారం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య రోహిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

వాంకిడి(ఆసిఫాబాద్): జొన్నపంటకు కాపలా వెళ్లిన రైతుపై అడవిపంది దాడి చేసిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. చౌపన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న పుల్లార గ్రామానికి చెందిన కుంరం మారుతి ఉదయాన్నే తన జొన్న పంటకు కాపలాగా వెళ్లాడు. కాపాలా కాస్తున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన అడవిపంది అతని ఛాతిపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

చింతలమానెపల్లి(సిర్పూర్): డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడలో ఆదివారం సాయంత్రం పిచ్చికుక్క దాడి చేయడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గుర్లె విలాస్ కుమారుడు కుమారస్వామి, బోర్లె వెంకటేశ్ కుమారుడు విఘ్నేష్ ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చి కుక్క దాడి చేసింది. చిన్నారులను 108లో కౌటాల పీహెచ్‌సీకి తరలించగా వైద్యుడు అందుబాటులో లేక పోవడంతో పాటు కుక్కకాటుకు మందు లేదని సిబ్బంది చెప్పారు. విఘ్నేష్‌కు టీటీ ఇంజక్షన్ వేసి ఇంటికి పంపించారు. వైద్యసిబ్బంది సూచన మేరకు కుమారస్వామిని సిర్పూర్ సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడకూడా కుక్కకాటు మందు లేక పోవడంతో మంచిర్యాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు బాలుడి తండ్రి తెలిపారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఫిబ్రవరి 1వరకు పొడిగించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలకు 217 దరఖాస్తులు ఇప్పటి వరకు విద్యాశాఖ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు.

అధికారులకు ప్రశంసాపత్రాలు

మంచిర్యాలటౌన్: ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అధికారులకు హైదరాబాద్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ, పునశ్చరణ కార్యక్రమాలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసపత్రాలు అందజేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ ప్రీతి మీనా చేతుల మీదుగా మంచిర్యాల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ వి.అనిల్ కుమార్ ప్రశంసపత్రం అందుకున్నారు.

ఐటీ మాఫీ చేయాలని నేడు ధర్నా

శ్రీరాంపూర్: కార్మికుల వేతనంలో అధిక శాతం ఆ దాయ పన్నుకే పోతోందని, మాఫీ చేయాలని డి మాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య తెలిపారు. సోమవారం ఆయ న ఎస్సార్పీ ఓసీపీపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. 11వ వేజ్‌బోర్డులో కార్మికులకు 19శా తం ఎంజీబీతో మెరుగైన వేతన ఒప్పందం సాధించామని, మిగతా అలవెన్స్‌లు, ప్రయోజనాలపై తదుపరి సమావేశాల్లో చర్చిస్తామని అన్నారు. కొత్త వేతన ఒప్పందం వల్ల మరింత పన్ను భారం పడనుందని, ప్రభుత్వ పన్ను మాఫీ చేయాలని, లేనిపక్షంలో రీయింబర్స్‌మెంటు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో కార్మికులకు ఇన్సెంటివ్‌ల చెల్లింపులో తీవ్ర అన్యాయం జరుగుతోందని, దీన్ని సరిచేయాలని పేర్కొన్నారు. యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్కే.బాజీసైదా, కే.వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఉపాధ్యక్షుడు ఆర్.చంద్రమోహన్, బ్రాంచీ సహాయ కార్యదర్శులు జీ.నర్సింగరావు, ఫిట్ సెక్రెటరీ మోహన్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల నుంచి 52 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను ఆయా విభాగాల అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని ఆదేశించారు. డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఏపీవో జనరల్ భీంరావ్, ఏవో రాంబాబు, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

- స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా డైనోస్టిక్ సెంటర్ ఏర్పాటుకు రుణం మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం లింగోజీ తండాకు చెందిన రవికిరణ్ అర్జీ పెట్టుకున్నాడు. – కుటుంబ పోషణ, స్వయం ఉపాధి కోసం వాహనం కొనుగోలుకు రుణం అందించాలని వట్టివాగుకు చెందిన వినోద్‌కుమార్ వేడుకున్నాడు.
- తమ వ్యవసాయ చేనులో బోరుబావితోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించేలా రుణం అందించాలని ఇంద్రవెల్లి మండలం అంజికి చెందిన శశికళ విన్నవించింది.
- తనకు ఆసరా పింఛన్ ఇప్పించాలని ఉట్నూర్ మండలం రాంజీగోండ్‌నగర్‌కు సోయం సుభాష్ అర్జీ పెట్టుకున్నాడు.
- తనకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంద్రవెల్లి మండలం ఈశ్వర్‌నగర్‌కు చెందిన ఆర్.నిరంజన్ విన్నవించాడు.



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వరుణ్‌రెడ్డి

బొగ్గు ఉత్పత్తిలో ఆదర్శం 'ఆర్కే 6'

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు ఉత్పత్తిలో ఆర్కే 6 గని అన్ని భూగర్భ గనులకు ఆదర్శంగా నిలిచిందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఆర్కే 6 గనిపై సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ గనికి నిర్ధేశించిన వార్షిక లక్ష్యం 1.8 లక్షల టన్నులనుగానూ ఈ నెల 28 నాటికే సాధించారన్నారు. 63 రోజులకు ముందే వార్షిక లక్ష్యం సాధించి కంపెనీలో రికార్డు సృష్టించిందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం తలసేమియాతో బాధపడుతున్న చిన్నారి గౌషి యా వైద్యచికిత్సల కోసం గని ఉద్యోగులంతా కలి సి సేకరించిన విరాళం రూ.50,010 బాధిత కు టుంబానికి అందించి ఔదార్యం చాటుకున్నారు.

ఏఎస్‌ఓకు సన్మానం..

శ్రీరాంపూర్ ఏరియా సేఫ్టీ అధికారిగా పనిచేసిన గోషిక మల్లేశ్ నేడు ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా ఆయనను జీఎంతో పాటు గ్రూపు ఏజెంట్ ఏవీ రెడ్డి, మేనేజర్ తిరుపతి శాలువాతో సత్కరించారు. టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, సేఫ్టీ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి ఆర్.రాంనర్సయ్య, అధికారులు కొమురయ్య, అందె శ్యాంకుమార్, మహేశ్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



ఏఎస్‌ఓ మల్లేశ్‌ను సన్మానిస్తున్న జీఎం

వేంపల్లికి ఇసుక రీచ్?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని గోదావరికి ఇసుక రీచ్‌ను కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల గనులు, భూగర్భ శాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఇసుక రీచ్ నిర్వహణపై సర్వే నిర్వహించారు. ఈ మేరకు వేంపల్లి గోదావరి నుంచి ఇసుక రవాణా చేసుకునేందుకు అధికారికంగా ఇసుక రీచ్ ఏర్పాటుపై స్పష్టమైన నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది.